## క్లుప్తంగా

### ఏఎంసీ వైస్ చైర్మన్‌కు సన్మానం



తాడ్వాయి(ఎల్లారెడ్డి) : మండలంలోని చిట్యాలలో నాయికమ్మ ఆలయం వద్ద ఆదివారం మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్‌గా ఎంపికైన జక్కుల రాజిరెడ్డి గ్రామపెద్దలు సన్మానించారు. ఈ సందర్భంగా పీఆర్‌టీయూ తెలంగాణ జిల్లా అధ్యక్షుడు అంబీర్‌మనోహర్‌రావు మాట్లాడుతూ రాజిరెడ్డి గ్రామాభి వృద్ధికోసం ఎంతో కృషి చేశారన్నారు. గ్రామపెద్దలు కిషన్‌రావు, బాపురావు, మహిపాల్‌రెడ్డి, గంగారాజు తదితరులున్నారు.

### ఆర్ కృష్ణయ్యకు సన్మానం



కామారెడ్డి టౌన్ : జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్ కృష్ణయ్యను జిల్లా బీసీ సంక్షేమ సంఘ నాయకులు ఆదివారం హైదరాబాద్‌లో ఘనంగా సన్మానించారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు కామారెడ్డి జిల్లా బీసీ డిక్లరేషన్ అమలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కాముని సుదర్శన్, కామారెడ్డి జిల్లా అధ్యక్షుడు చింతల శంకర్, జిల్లా కార్యదర్శి లోక సంతోష్ తదితరులున్నారు.

### నేడు, రేపు అండర్-14,17 ఖోఖో ఎంపికలు

కామారెడ్డి రూరల్ : కామారెడ్డి మండలం గర్గుల్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమ, మంగళవారాల్లో అండర్-14-17 బాల బాలికలకు ఖోఖో ఎంపికలు నిర్వహించనున్నట్లు జిల్లా ఖోఖో ఇన్‌చార్జి, పీఈటీ నోముల మధుసూదన్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి పాఠశాల నుంచి నలుగురు బాల బాలికలు పాల్గొనాలన్నారు. అండర్-14 విభాగంలో 01.01.2011, అండర్-17 విభాగంలో 01.01.2008 లోపు జన్మించి ఉండాలని తెలిపారు. అర్హులు తమ బోనోఫైడ్స్, సర్టిఫికెట్లతో ఉదయం 9 గంటలకు జెడ్పీహెచ్‌ఎస్ గర్గుల్ పాఠశాలలో రిపోర్ట్ చేయాలన్నారు. 94942 59901లో సంప్రదించాలన్నారు.

### పీసీసీ అధ్యక్షుడికి సన్మానం




భిక్కనూరు : కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడిగా నియమితులైన మహేష్‌కుమార్‌గౌడ్‌ను ఆ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు మద్ది చంద్రకాంత్‌రెడ్డి ఆదివారం సన్మానించారు. గాంధీభవన్‌లో మహేశ్‌కుమార్‌గౌడ్‌ను సన్మానించి అభినందించారు. ఈ సందర్భంగా మహేశ్‌కుమార్‌గౌడ్ మాట్లాడుతూ పార్టీని గ్రామస్థాయి నుంచి మరింత బలోపేతం చేయాలని సూచించారు.

### పరుగు పందెంలో క్రీడాకారుల ప్రతిభ



భిక్కనూరు : కరీంనగర్ జిల్లా కేంద్రంలో నిర్వహించిన పరుగు పందెం పోటీల్లో భిక్కనూరుకు చెందిన క్రీడాకారులు ఆదివారం ప్రతిభ చూపి మెడల్స్ అందుకున్నారు. గంగళ్ల శ్రీయరాజ్, నీల అఖిల్, గంగళ్ల రాగూర్, భరత్, ప్రియాంక,రవళి,నిరీక్షణ హాఫ్ మారథాన్‌తో పాల్గొని ప్రతిభ చూపి మెడల్స్ అందుకున్నారు.

### ఎండుతున్న సోయాబీన్



మద్నూర్(జుక్కల్) : రైతులు విత్తిన సోయాబీన్ పంట ఎండు దశకు చేరి కోతకు రాబోతుందని రైతులు పేర్కొన్నారు. వానాకాలంలో రైతులు సాగు చేసిన సోయాపంట ప్రస్తుతం భారీ కాయతో ఎండుతోందని మరో ఇరవై రోజుల్లో సోయాబీన్ కల్లాలు ప్రారంభమవుతున్నాయని రైతులు చెబుతున్నారు. మరోవైపు వానాకాలంలో ముందుగా వేసిన సోయాబీన్ పంట ప్రస్తుతం చేతికి వచ్చిందని రైతులు మిషన్ల ద్వారా కల్లాలు మొదలుపెట్టారు.

### నేలకొరిగిన వరి



లింగంపేట : మండలంలోని పొల్కంపేట, కన్నాపూర్ గ్రామాల్లో శనివారం రాత్రి ఈదురు గాలులతో కూడిన వర్షం కురియడంతో వరి పంటలు నేలకొరిగాయి. పదిహేను రోజుల్లో కోతకు వచ్చిన వరి పంటలు ఈదురు గాలులకు నేలకొరగడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేశారు.

# పెరిగిన చోరీలతో భయాందోళన

- సంతలో ఒకేరోజు 11 సెల్‌ఫోన్ల చోరీ
- వాహనాలు మాయమవుతున్న వైనం
- నిఘా పెంచాలని కోరుతున్న జనం




బాన్సువాడ పోలీస్‌స్టేషన్

బాన్సువాడ : బాన్సువాడ పట్టణానికి చెందిన విజయ్ తన భార్యతో ఈనెల 12న కూరగాయల కోసం వారంతపు సంతకు వెళ్లారు. కురగాయలు కొనుగోలు చేస్తున్న సమయంలో జేబులో ఉన్న సెల్‌ఫోన్ మాయమైంది. చుట్టుపక్కల వెతికినా దొరకలేదు. అదే రోజు సంతలో మరో 10 సెల్ ఫోన్లు చోరీకి గురయ్యాయి. ఇలా సంతలోనే కాకుండా మండలంలో చోరీలు విపరీతంగా పెరిగాయి. బాధితులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తూనే ఉన్నారు.

పట్టణంలోని చైతన్య కాలనీకి చెందిన శ్రీగాధ ప్రవీణ్‌కుమార్‌కు చెందిన గ్లామర్ బైక్ ఈనెల 15న చోరీకి గురైంది. అదే రోజు రాత్రి ఇదే కాలనీలో తాటి రాజేష్ అనే వ్యక్తికి చెందిన కిరాణ దుకాణం షట్టర్ తాళాలు పగులగొట్టి కౌంటర్‌లో ఉన్న రూ.10 వేల నగదు చోరీకి గురైంది. పోలీసు కేసులు నమోదు అయినవి కొన్నైతే కేసులు నమోదు కానివి ఎన్నో ఉన్నాయని తెలుస్తోంది. ఇలా నాలుగైదు నెలలుగా బాన్సువాడలో చోరీలు అధికమవుతున్నాయి. గతంలో రాత్రి వేళల్లో గస్తీ నిర్వహించే పోలీసులు ఈ మధ్య కాలంలో గస్తీ కూడా చేయడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. బాన్సువాడలో జరుగుతున్న వరుస చోరీలతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ప్రతి గురువారం జరిగే వారంతపు సంతలో నిఘా పెట్టాల్సి ఉంది. పోలీసులు స్పందించి రాత్రి వేళల్లో గస్తీ పెంచాల్సిన అవసరమెంతైన ఉందని ప్రజలు అభిప్రాయ పడుతున్నారు.

**ఇటీవల జరిగిన సంఘటనలు..**

- మూణ్నెళ్ల క్రితం పట్టణంలోని సంగమేశ్వర కాలనీకి చెందిన సాయిలు తూఫాన్ వాహనం చోరీకి గురైంది. చోరీకి గురైన తూఫాన్ వాహనం రెండు రోజుల తర్వాత బిచ్కుంద మండలం పుల్కల్ శివారులో ప్రత్యక్షమైంది.
- పట్టణానికి చెందిన ఓ వ్యక్తి ట్రాలీ ఆటోను గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించారు. ఆ ఆటో పిట్లం మండలంలో విడిచి వెళ్లారు.
- ఈ నెల 12న బాన్సువాడ వారంతపు సంతలో కురగాయలు కొనేందుకు వచ్చిన 11 మంది సెల్‌ఫోన్లు చోరీకి గురయ్యాయి.
- ఈనెల 15న చైతన్య కాలనీలో బైక్ చోరీకి గురైంది.
- ఈనెల 15న చైతన్య కాలనీలో కిరాణ దుకాణం షటర్ తాళాలు పగులగొట్టి రూ.10 వేల నగదు అపహరించుకెళ్లారు.

**నిఘా పెడుతున్నాం**

బాన్సువాడ పట్టణంలోని చైతన్య కాలనీలో బైక్ చోరీ కేసును రెండు రోజుల్లో ఛేదించాం. కిరాణ దుకాణంలో చోరీ వివరాలను కూడా సేకరిస్తున్నాం. గణేశ్ నిమజ్జనం ఉండడంతో కొంత జాప్యం జరిగింది. చోరీలపై ప్రత్యేక నిఘా పెడతాం.

– కృష్ణ, సీఐ, బాన్సువాడ

## త్వరలో బీమా రంగంలో మార్పులు



మాట్లాడుతున్న లియాఫీ జాతీయ సెక్రటరీ జనరల్ ఎస్‌బీ శ్రీనివాసాచారి

కామారెడ్డి అర్బన్ : బీమా రంగంలో మార్పులు రాబోతున్నాయని వచ్చే ఏడాది నుంచి డిజిటలైజేషన్‌లో భాగంగా 90 శాతం కాగిత రహిత కార్యకలాపాలు నిర్వహిస్తాయని ఎల్‌ఐసీ ఏజెంట్ల సమాఖ్య (లియాఫీ) జాతీయ సెక్రటరీ జనరల్ ఎస్‌బీ శ్రీనివాసాచారి అన్నారు. ఆదివారం స్థానిక అయ్యప్ప ఫంక్షన్‌హాల్‌లో లియాఫీ కామారెడ్డి శాఖ సాధారణ సభ్య సమావేశం నిర్వహించగా ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఎల్‌ఐసీ బీమా చట్టం ప్రకారం కేవలం ఎల్‌ఐసీ ఏజెంట్లకు మాత్రమే సంస్థ పరంగా రక్షణ ఉందన్నారు. ఈ సమావేశంలో లియాఫీ సికింద్రాబాద్ డివిజన్ అధ్యక్షుడు రా మస్వామి, కార్యదర్శి సునీల్‌కుమార్ తదితరులున్నారు.

**లియాఫీ నూతన కార్యవర్గం ఏకగ్రీవ ఎన్నిక**



కామారెడ్డి అర్బన్ : ఎల్‌ఐసీ ఏజెంట్ల సమాఖ్య (లియాఫీ) కామారెడ్డి శాఖ నూతన కార్యవర్గం (2024–27) ఎన్నికలు మూడేళ్ల కాలానికి ఆదివారం సాయంత్రం స్థానిక అయ్యప్ప ఫంక్షన్ హాల్ నిర్వహించగా అధ్యక్షుడిగా కదం నారాయణరావు, ప్రధాన కార్యదర్శిగా ప్రదీప్‌కుమార్ జైన్, కోశాధికారిగా ఆకుల ఉమాపతిలు ఎన్నికయ్యారు. మిగితా కార్యవర్గ సభ్యులను అందరి సమన్వయంతో త్వరలోనే నియమించనున్నట్లు నూతన అధ్యక్షుడు కదం నారాయణరావు తెలిపారు.

## ‘తెలంగాణ రైతు–గ్రామీణ జీవితం’ పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న తెలంగాణ రచయితల వేదిక ప్రతినిధులు

కామారెడ్డి అర్బన్ : మట్టి మనుషులు అన్నదాతలను కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని కీర్తి పురస్కార గ్రహీత సూరారం శంకర్ అన్నారు. తెలంగాణ రచయితల వేదిక ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక సీనియర్ సిటిజన్ ఫోరం భవనంలో ప్రముఖ కవి, రచయిత కాసర్ల రామచంద్రం రాసిన పరిశోధక గ్రంథం తెలంగాణ రైతు–గ్రామీణ జీవితం పుస్తకావిష్కరణ జరిగింది. ఈ సందర్భంగా సూరారం శంకర్ మాట్లాడుతూ రచయిత కాసర్ల రామచంద్రం తన రచనలో తెలంగాణ రైతుల జీవితం, ఆయా వృత్తుల పనిముట్లు, సాంస్కృతి, సాంప్రదాయలు, రైతు కష్టాలను చక్కగా వివరించారన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ మాజీ సభ్యురాలు సుమిత్రానంద్, గ్రంథాలయ సంస్థ జిల్లా మాజీ చైర్మన్ పున్న రాజేశ్వర్, తెరవే జిల్లా అధ్యక్షుడు గఫూర్ శిక్షక్, పీఆర్‌టీయూ తెలంగాణ జిల్లా అధ్యక్షుడు మనోహర్‌రావు మాట్లాడుతూ జిల్లాలో సాహిత్య సృజన చాలా గొప్పగా సాగడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వై గంగాప్రసాద్, పబ్బ విజయశ్రీ, నాగభూషణం, అల్లి మోహన్‌రాజ్, పీవీ నర్సింహం తదితరులు పాల్గొన్నారు.

### నాసిరకంగా రహదారి విస్తరణ పనులు



బాన్సువాడ రూరల్ : అధికారులు దగ్గరుండి ఎంతో నాణ్యతతో చేపట్టాల్సిన జాతీయ రహదారి విస్తరణ పనులు మండలంలో నాసిరకంగా సాగుతున్నాయి. రహదారి విస్తరణలో భాగంగా ముందుగా కల్వర్టులను పునర్నిర్మిస్తున్నారు. అలాగే అండర్‌గ్రౌండ్ డ్రైయినేజీ పనులు చేపడుతున్నారు. సీసీ డ్రైయినేజీ పనులకు ఎలాంటి వాటర్ క్యూరింగ్ చేయకపోవడంతో నాణ్యత లోపించింది. విస్తరణ పనులకు మొరం వినియోగించాల్సి ఉండగా నాణ్యతలేని నల్లమట్టి వినియోగిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు.

### దివంగత ప్రముఖులకు నివాళి



కామారెడ్డి అర్బన్ : ఇటీవల అకాల మరణం చెందిన దాశరథి పురస్కార గ్రహీత డాక్టర్ అయాచితం నటేశ్వరశర్మ, కామారెడ్డి ప్రాచ్యకళాశాల వ్యవస్థాపకులు ప్రొఫెసర్ అమరేశం రాజేశ్వరశర్మ, ఆచార్యులు గణపురం కృష్ణమూర్తి శర్మలకు బ్రాహ్మణ సమాఖ్య జిల్లా కమిటీ ఘనంగా నివాళ్లు అర్పించింది. స్థానిక వశిష్ట డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన సంతాప సభలో ముగ్గురు విశిష్ట వ్యక్తుల అకాల మరణం సమాజానికి, బ్రాహ్మణ సమాజానికి తీరని లోటని వక్తలు నివాళులర్పించారు. సంతాపసభలో బ్రాహ్మణ సమాఖ్య జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసశర్మ, కార్యదర్శి సతీష్‌శర్మ, కోశాధికారి నవీన్ ఉన్నారు.

## సమాచారం..

**నేడు అభ్యర్థులకు డెమో క్లాసులు**

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి) : నాగిరెడ్డిపేట మండలంలోని గోపాల్‌పేట మోడల్‌స్కూల్‌లో ఖాళీగా ఉన్న పీజీటీ, టీజీటీ పోస్టులకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు సోమవారం డెమోక్లాసులు నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ రాంప్రసాద్ తెలిపారు. పీజీటీ, టీజీటీ పోస్టులకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు సోమవారం ఉదయం 10గంటలకు రావాలన్నారు.

**నేడు తాడ్వాయిలో ప్రజావాణి**

తాడ్వాయి(ఎల్లారెడ్డి) : మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ప్రజావాణి నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ రహీమొద్దీన్ తెలిపారు. ఈ ప్రజావాణి ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఉంటుందన్నారు.

**రేపు మండల సమాఖ్య సమావేశం**

తాడ్వాయి(ఎల్లారెడ్డి) : మండల కేంద్రంలోని ఐకేపీ కార్యాలయంలో ఈనెల 24వ తేదీన మంగళవారం మండల సమాఖ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఐకేపీ ఏపీఎం రవీందర్ తెలిపారు. ఉదయం 10గంటలకు మండల సమాఖ్య అధ్యక్షురాలు యశోద బాయి అధ్యక్షతన సమావేశం ఉంటుందన్నారు.

**నేడు జిల్లా ఆర్యవైశ్య సంఘం ప్రమాణ స్వీకారం**



బాలకిషన్

ఎల్లారెడ్డి : జిల్లా ఆర్యవైశ్య సంఘం నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమం సోమవారం ఎల్లారెడ్డిలో జరగనున్నట్లు సంఘం ప్రతినిధులు తెలిపారు. పట్టణంలోని రాఘవులు కల్యాణమండపంలో జరగనున్న ఈ కార్యక్రమంలో జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడిగా కంచర్ల బాలకిషన్‌తో పాటు కార్యవర్గం ప్రమాణ స్వీకారం చేస్తారన్నారు.

### పల్లె దవాఖానాలో మాజీ సీఎం ఫొటో



బిచ్కుంద(జుక్కల్) : మండలంలోని మిషన్ కల్లాలో పల్లె దవాఖానాలో మాజీ సీఎం కేసీఆర్ ఫొటో లు ఇప్పటికీ దర్శన మిస్తున్నాయి. సీఎం రేవంత్ రెడ్డి ఉన్న విషయం అధికారులకు ఇంకా తెలియడం లేదని పలువురు చర్చించుకుంటున్నారు. కొత్త ప్రభుత్వం ఏర్పాటై 10 నెలల కావస్తున్నా పల్లె దవాఖానాలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఫ్లెక్సీలు, ఫొటోలు చూసి ప్రజలు అవాక్కవుతున్నారు.

### తగ్గిన మినుము దిగుబడి



మద్నూర్(జుక్కల్) : మండలంలో మినుము పంట కల్లాలు జరుగుతున్నాయి. మినుము పంట చేతి కందుతున్న సమయంలో భారీ వర్షాలు కురియడంతో పంటల దిగుబడిపై తీవ్ర దెబ్బపడింది. ఎకరానికి 5 క్వింటాళ్ల దిగుబడి రావాల్సి ఉండగా భారీ వర్షాలతో ఎకరానికి 3 క్వింటాలు కూడా రాలేదని రైతులు ఆవేదన చెందుతున్నారు. మండల కేంద్రానికి సమీపంలో రైతులు మినుము కాయను ఏరుకోని గింజ గింజ మినుమును జమ చేసుకున్నారు.

## ప్రమాదకరంగా మూలమలుపులు

- 2 కి.మీ లోపు ఆరుచోట్ల మలుపులు

సదాశివనగర్(ఎల్లారెడ్డి) : మండలంలోని ధర్మారావ్‌పేట్ నుంచి మోడెగాం గ్రామానికి సుమారు 2 కిలో మీటర్ల దూరం ఏర్పాటు చేసిన బీటీ రోడ్డుపై ఆరు మలుపులు ప్రమాదకరంగా ఉన్నాయి. మలుపుల వద్ద సంబంధిత అధికారులు కనీసం సూచిక బోర్డులు ఏర్పాటు చేయలేదు. దీంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. అధికారులు స్పందించి సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని వాహనదారులు కోరుతున్నారు.



మోడెగాం-ధర్మారావ్‌పేట్ గ్రామాల మధ్య సూచిక బోర్డు లేని మూలమలుపు

## కస్తూర్బాలో సమస్యలను పరిష్కరిస్తాం

- బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి



సమస్యలు తెలుసుకుంటున్న సబ్ కలెక్టర్ కిరణ్మయి

నిజాంసాగర్(జుక్కల్) : కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి అన్నారు. కస్తూర్బా విద్యార్థినులు ఎదుర్కొంటున్న సమస్యలను తల్లిదండ్రులు, టీచర్లు సబ్ కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. ఆదివారం మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాన్ని సబ్ కలెక్టర్ సందర్శించారు. సదరు కస్తూర్బా విద్యాలయంలో బాలికలకు మూత్ర శాలలు, మరుగుదొడ్లు అధ్వానంగా ఉన్నాయని, ప్రహరీ లేదని, మురికినీళ్ల వెళ్లే దారి లేక పరిసరాలు అస్తవ్యస్తంగా ఉన్నాయని సబ్ కలెక్టర్ గుర్తించారు. తరగతి గదులతో పాటు డార్క్ రూముల కొరత ఉందని గదుల నిర్మాణం కోసం ప్రభుత్వానికి ప్రతిపాదిస్తామన్నారు. విద్యార్థినులకు వడ్డిస్తున్న భోజనాన్ని రుచి చూశారు.

**వర్షానికి దెబ్బతిన్న ఇళ్ల పరిశీలన**

ఇటీవల కురిసిన వర్షాలకు మండలంలోని సుల్తాన్ నగర్, ఒడ్డేపల్లి, ఆరేడ్ గ్రామాల్లో దెబ్బతిన్న ఇళ్లను బాన్సువాడ సబ్‌కలెక్టర్ కిరణ్మయి పరిశీలించారు. పాక్షికంగా దెబ్బతిన్న ఇళ్లకు ప్రభుత్వపరంగా వచ్చిన ఆర్థికసాయం వివరాలను తెలుసుకున్నారు.

**‘సాగర్’ సందర్శన**

నిజాంసాగర్ ప్రాజెక్టును బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి సందర్శించారు. ఎగువ ప్రాంతాల నుంచి ప్రాజెక్టులోకి వస్తున్న వరద నీరు, అవుట్‌ఫ్లో, ఫ్లడ్ గేట్లు, ఆయకట్టు విస్తీర్ణం వివరాలను నీటిపారుదలశాఖ అధికారుల ద్వారా తెలుసుకున్నారు. ప్రాజెక్టు గేట్లు, గుల్‌దస్తా వద్ద పర్యాటకులతో మాట్లాడారు. తహసీల్దార్ భిక్షపతి, గిర్దావర్ ఉన్నారు.

### మెగా వైద్య శిబిరానికి స్పందన



మద్నూర్(జుక్కల్) : మండల కేంద్రంలోని వాసవి పాఠశాలలో ఆదివారం మెగా వైద్యశిబిరాన్ని బీజేపీ జిల్లా అధ్యక్షురాలు, మాజీ ఎమ్మెల్యే అరుణతార, మాజీ ఎంపీ బీబీపాటిల్ ప్రారంభించారు. ప్రధాని మోదీ 74వ బర్త్‌డే సందర్భంగా మెగా ఆరోగ్య శిబిరం ఏర్పాటు చేశామన్నారు. 340 మందికి వైద్యం అందించినట్లు పార్టీ అధ్యక్షుడు తుకారాం తెలిపారు.

### బీర్కూర్‌లో బీజేపీ సభ్యత్వ నమోదు

బాన్సువాడ : ప్రధాని మోదీ సంకల్పించిన వికసిత భారత్ కల సాకారం కావాలని ఓబీసీ రాష్ట్ర నాయకులు మక్కన్న అన్నారు. ఆదివారం బీర్కూర్ మండల కేంద్రంలో బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. బీజేపీ మండల అధ్యక్షులు సాయికిరణ్, శ్రీనివాస్ తదితరులున్నారు.



## బీడీ కార్మికులకు పింఛన్ పెంచాలి



మాట్లాడుతున్న శివంది సత్యం

దోమకొండ : గత ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ ప్రకారం ప్రభుత్వం పింఛన్‌ను నెలకు రూ. 4 వేలకు పెంచాలని తెలంగాణ నూతన బీడీ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శివంది సత్యం అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో సంఘం ప్రతినిధులతో కలిసి విలేకరులతో మాట్లాడారు. గత ఎన్నికల సమయంలో సీఎం రేవంత్‌రెడ్డి బీడీ కార్మికులతో పాటు గీత కార్మికులు, వికలాంగులు, వృద్ధులు, వితంతువులకు నెలకు రూ. 4 వేల పింఛన్ ఇస్తానని ప్రకటించారన్నారు. ఈ సమావేశంలో సంఘం మండల ప్రతినిధులు ఐరేని నర్సయ్య, ఎస్‌కే హసన్, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

## కార్యవర్గం ఎన్నిక ..

**నూతన కార్యవర్గం ఎన్నిక**



బాశెట్టి నాగేశ్వర్ డివిజన్ అధ్యక్షుడు

బీబీపేట : ఆర్యవైశ్య సంఘం, వాసవి క్లబ్ మహాసభ డివిజన్ అధ్యక్షుడిగా బీబీపేటకు చెందిన బాశెట్టి నాగేశ్వర్, కార్యదర్శిగా దుద్దెళ్ల ప్రసాద్, కార్యవర్గ సభ్యుడిగా తాటిపల్లి రమేష్, సేవాదళ్ ఉపాధ్యక్షుడిగా పబ్బ యాదగిరిలను జిల్లా అధ్యక్షుడు కంచర్ల బాలకిషన్ అధ్వర్యంలో ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

**అంబేద్కర్ యువజన సంఘం..**

ఎల్లారెడ్డి రూరల్ : ఎల్లారెడ్డి డివిజన్ ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షుడిగా ప్రదీప్ కుమార్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు సంఘం సభ్యులు తెలిపారు. ఆదివారం ఎల్లారెడ్డి మార్కెట్ కమిటీ ఆవరణలో జరిగిన ఈ ఎన్నికల్లో సంఘం అధ్యక్షుడితో పాటు ప్రధాన కార్యదర్శిగా సాతెల్లి పద్మారావు, వర్కింగ్ ప్రసిడెంట్‌గా రమేశ్‌ను ఎన్నుకున్నట్లు వారు తెలిపారు. వీరితో పాటు ఎల్లారెడ్డి మండల కమిటీ అధ్యక్షుడిగా ఎడ్ల కిషన్, ప్రధాన కార్యదర్శిగా శివానందం, వర్కింగ్ ప్రసిడెంట్‌గా మహేందర్‌ను, పట్టణ కమిటీ అధ్యక్షుడిగా రొడ్డ నరేష్, ప్రధాన కార్యదర్శిగా పురం రాజు, వర్కింగ్ ప్రసిడెంట్‌గా గుంటిగారి రాజును ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు సంఘం సభ్యులు తెలిపారు.



### దుర్గామాత మండప నిర్మాణానికి భూమి పూజ



కామారెడ్డి రూరల్ : కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని లింగాపూర్ పరిధిలోని కల్కినగర్‌లో దుర్గామాత సేవ సమితి కల్కినగర్ వారి ఆధ్వర్యంలో దుర్గామాత షెడ్డు నిర్మాణం కోసం ఆదివారం అర్చకుడు శ్రీకాంత్ శర్మ భూమి పూజ చేశారు. కమిటీ సభ్యులు పోతరాజు వెంకటేశ్, డాక్టర్ పోచయ్య, రాజేందర్, నిట్టు రఘు తదితరులున్నారు.

## సంక్షిప్తం

**తెలంగాణ రచయితల వేదికలో సభ్యత్వాలు**

కామారెడ్డి అర్బన్ : తెలంగాణ రచయితల వేదిక(తెరవే) ఆదివారం నూతన సభ్యత్వాన్ని పలువురు రచయితలు, కళాకారులు, కవులకు అందజేసినట్లు తెరవే జిల్లా అధ్యక్షుడు సిరిసిల్ల గఫూర్ శిక్షక్ తెలిపారు. ఈ కార్యక్రమంలో పిల్లనగ్రోవి విద్వాంసుడు కిషన్, పద్యాల పఠణంలో విద్వాంసుడు ప్రభాకర్, కథకులు పూర్ణచందర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

**పెండింగ్ డీఏలు చెల్లించాలి**

దోమకొండ : ఉద్యోగులకు రావాల్సిన 4 పెండింగ్ డీఏలను ప్రభుత్వం వెంటనే ప్రకటించాలని పంచాయితీ రాజ్ మినిస్ట్రీరియల్ ఉద్యోగుల సంఘం దోమకొండ బ్లాక్ ప్రధాన కార్యదర్శి నిజ్జని శ్రీకాంత్ ఆదివారం కోరారు. జులై-2022 నుంచి జులై 2024 వరకు రావాల్సిన డీఏలను ప్రకటించాలన్నారు.

**విద్యుత్ స్తంభాలకు మరమ్మతులు**

బిచ్కుంద(జుక్కల్) : మండల కేంద్రంలో ఆదివారం విద్యుత్ అధికారులు ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ స్తంభాలకు మరమ్మతులు చేపట్టారు. ఒకటో వార్డు, చాకలి గల్లీలో స్తంభాలు వంగాయి. అధికారులు స్పందించి విద్యుత్ స్తంభాలు తొలగించి సిమెంట్ స్తంభాలు వేశారు.

**పార్టీ బలోపేతానికి కృషి చేయాలి**

లింగంపేట(ఎల్లారెడ్డి) : గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి ప్రతీ ఒక్కరూ కృషి చేయాల మండల పార్టీ నాయకుడు ఎల్లమయ్య సూచించారు. ఆదివారం ఆయన లింగంపేట మండలం అయ్యపల్లి, అయ్యపల్లి తండా, మెంగారం, బోనాల్ గ్రామాల్లో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. కార్యక్రమంలో మండల నాయకులు ఎల్లమయ్య, అశోక్, రాజు, రమేశ్ తదితరులున్నారు.

**వాహనాల తనిఖీ**

పెద్దకొడప్‌గల్(జుక్కల్) : మండలంలోని బేగంపూర్ చౌరస్తా 161 జాతీయ రహదారిపై ఏఎస్సై రాములు ఆధ్వర్యంలో తనిఖీలు చేశారు. వాహనదారులు ఎల్లప్పుడూ తమ ధ్రువీకరణపత్రాలు వెంచ ఉంచుకోవాలన్నారు. పోలీస్ సిబ్బంది అంజి తదితరులు పాల్గొన్నారు.

**ప్రతిఒక్కరూ రక్తదానం చేయాలి**

బాన్సువాడ : రక్తదానం చేసిన ప్రాణదాతలు కావాలని హ్యూమానిటీ వెల్ఫేర్ ట్రస్ట్ వ్యవస్థాపకులు మౌలానా రిజ్వాన్ అన్నారు. మహమ్మద్ ప్రవక్త పుట్టిన నెల సందర్భంగా ఆదివారం బాన్సువాడ ఆస్పత్రిలో రక్తదానం చేశారు. మహమ్మద్ ప్రవక్త పుట్టిన నెల సందర్భంగా ఆరేళ్లుగా రక్తదానం చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ అధ్యక్షులు షకీల్, అక్బర్ తదితరులు ఉన్నారు.

**చిన్నమల్లారెడ్డిలో వినాయకుల నిమజ్జనం**



కామారెడ్డి రూరల్ : కామారెడ్డి మండలం చిన్నమల్లారెడ్డిలో వినాయకుల నిమజ్జనం ఆదివారం ఘనంగా నిర్వహించారు. శనివారం రాత్రి ప్రారంభమైన వినాయకుల శోభాయాత్ర ఆదివారం రాత్రి వరకు కొనసాగింది. ఈ సందర్భంగా నాసిక్ డోళ్లు, డప్పు చప్పుళ్లు, డీజే సౌండ్ సిస్టం మధ్య యువకులు నృత్యాలు చేస్తూ శోభాయాత్ర నిర్వహించారు. ప్రతిఏటా 15 రోజుల పాటు పూజలు చేసి 16వ రోజు నిమజ్జనం చేయడం గ్రామ ఆనవాయితీ.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు | వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు | శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

కామారెడ్డి & ఎల్లారెడ్డి

96034 62494
99122 20764

Office mail : nzbadvt@gmail.com

సాక్షి పాఠక మహాశయులకు విజ్ఞప్తి

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.

బాన్సువాడ: యం. మధుసూధన్ : 9951027699
ఎల్లారెడ్డి: డి. యల్. ఎన్. గౌడ్ : 6300453108
కామారెడ్డి : కె. రాజు : 9949699861
టోల్ ఫ్రీ నెం. 1800 425 9899